కాలితో దాన్ని పక్కకి తోసేసి వడివడిగా ముందుకు నడిచాడతను. చినుకులు ఉధృతమై వర్షంగా మారింది. ఏనుగు తొండాలతో గుమ్మరిస్తున్నట్లూ, సమ్మెటలతో మోదుతున్నట్లూ, భూమ్యాకాశాలను ఏకం చేస్తున్నట్టు కుంభవృష్టి కురుస్తోంది. మరుభూమే ఉదన్వంతంలా మారేట్టుంది.

అయినా అతడు తల దాచుకోవడానికి ఏ చెట్టునీ ఆశ్రయించలేదు. తన గమ్యం వైపు సాగిపోతూనే వున్నాడు. కాలిన కపాలాల మీద చినుకుపడి అది రవమై, భీకరమై, ఉద్ఘోషమై, సరోచ్ఛితమై భూనభోంతరాలని ఏకం చేసేలా వుంది.

*   *   *   *   *

చటుక్కున చేతిలోంచి పుస్తకం ఎవరో లాక్కోవటంతో ఉలిక్కిపడి తలెత్తి చూశాడు అభిరాం.

ఎదురుగా మహదేవ్!

"అభిరాం! నీకెన్నిసార్లు చెప్పాను ఇటువంటి పుస్తకాలు చదవొద్దని" అభిరాంకి ఎదురుగా ఎదురుగా కుర్చీలో కూర్చుంటూ అన్నాడతను.

అభిరాం, మహదేవ్ మంచి స్నేహితులు.

ఇద్దరి వయస్సూ ముప్పై ఏళ్ళలోపే! ఇద్దరూ అవివాహితులే.

అభిరాంకి, 'సృష్టి' అనే ఏడ్ ఏజెన్సీ వుంది. తెలుగులో వస్తున్న దిన, వార, మాస పత్రికలతో పాటు, కొన్ని ఆంగ్ల పత్రికలకి కూడ అతని కంపెనీ నుంచే ఏడ్స్ డిజైన్ చేయబడి అందించబడుతుంటాయి.

అతని కింద అయిదారుగురు ఏడ్స్ ఎగ్జిక్యూటివ్‌లు, ఇద్దరు గ్రాఫిక్ డిజైనర్లు, ఓ రిసెప్షనిస్ట్ పని చేస్తున్నారు. బేగంపేటలోని జబ్బర్ ఎస్టేట్ బిల్డింగ్‌లో ఓ విశాలమైన భవంతిలో వుందతని ఆఫీస్.

కంప్యూటర్లో డిజైన్ వచ్చిన ఏడ్స్‌ని పరిశీలించటం, ఎక్కడన్నా ఒకటి అరా కరక్షన్స్ వుంటే దిద్దటమే అతని పని.

తయారయిన ఏడ్స్‌ని అభిరాం 'ఇలా వుండాలి' అని చెప్పనవసరం లేకుండానే అద్భుతంగా డిజైన్ చేయగల సమర్థవంతులైన డిజైనర్లు అతనికి లభించటంతో అతనెక్కువగా తన ఛాంబర్లో కూర్చుని పుస్తక పఠనంలో మునిగిపోతాడు.

అవి కూడా మానవాతీత శక్తుల మీద రాసిన పుస్తకాలూ, హర్రర్, మంత్ర తంత్రాలతో వున్న పుస్తకాలే చదువుతాడతను. మానవాతీత శక్తులు, మంత్రతంత్రాలు వున్నాయని నమ్ముతాడు.

ఇక మహదేవ్ ఆర్కిటెక్చర్.

వాళ్ళిద్దరూ ఎలిమెంటరీ స్కూల్లో చదివేటప్పుడు పక్కపక్క ఇళ్ళల్లోనే వుండేవారు. అప్పట్నుంచీ వాళ్ళ స్నేహం అలా కొనసాగుతూనే వుంది.

అభిరాం ప్రస్తుతం జూబ్లీహిల్స్‌లో వుంటే, మహదేవ్ సైనిక్‌పురీ కాలనీలో వుంటున్నాడు.

అభిరాం తల్లిదండ్రులు మూడేళ్ళ క్రితం ఓ రోడ్ ఏక్సిడెంట్లో చనిపోతే ప్రస్తుతానికి అతనితోపాటు అతని అమ్మమ్మ వుంటుంది. అభిరాం ఒక్కడే సంతానం అతని తల్లిదండ్రులకి.

మహదేవ్‌కి మాత్రం తల్లీ, ఓ చెల్లీ వున్నారు. తల్లి గుంటూర్లో వుంటుంది. ఆమె భర్త అయిదేళ్ళ క్రితం హార్టెటాక్‌తో చనిపోయిన తర్వాత పట్నం జీవితమంటే విసుగొచ్చేసి, ప్రశాంతత కోసం గుంటూరు జిల్లాలోని సొంత వూరైన ఓ పల్లెటూరిలో వుంటుందామె. మహదేవ్ ఒక్కగా నొక్క చెల్లెలి పెళ్ళి లాస్ట్ ఇయరే అయిపోయింది.

"ఏమిటిలా వచ్చావ్? నికిత ఎలా వుంది?" తన కెదురుగా కూర్చున్న మహాదేవ్‌ని అడిగాడు అభిరాం.

"బిల్డింగ్ ప్లాన్‌లు గీసి గీసి బోర్ కొట్టింది. కాస్సేపు నీతో గడిపి వెళదామని వచ్చాను. నికిత వాళ్ళమ్మా నాన్నలని చూడటానికి వైజాగ్ వెళ్ళింది ..... " అభిరాం చేతిలోంచి లాక్కున్న నవలని టేబుల్‌మీద వుంచి అన్నాడతను.

"నవల చాలా ఇంట్రెస్టింగ్‌గా వుంది. ఆపబుద్ధికావటంలేదు" తిరిగి నవలందుకుంటూ అన్నాడు అభిరాం.

"ఉంటుందుంటుంది. నీకా సబ్జెక్టంటే మక్కువ కదా!"

"అవును!" అన్నాడు అభిరాం.

"నువ్వీ జనరేషన్‌లో పుట్టవలసినవాడివి కాదురా."

"నిజమే! ఏ వందేళ్ళో, రెండొందలేళ్ళో ముందు పుట్టున్నా బాగుండేది నేను."

"ఎందుకు?" ఆశ్చర్యంగా అడిగాడు మహదేవ్.

"నాకెంతో ఇష్టమైన మంత్రశక్తుల్ని నేర్చుకొని వుండేవాడివి" అన్నాడు.

"ఫూలిష్‌గా మాట్లాడకు."

"ఏం? ఎందుకని?"

"అసలు మంత్రాలూ లేవు, గింత్రాలూ లేవు."

"అని నువ్వెలా చెప్పగలవు?"

"పోనీ వున్నాయని నువ్వు చెప్పగలవా?" రెట్టిస్తూ అన్నాడు మహదేవ్.

"ఎస్" దృఢంగా అన్నాడు అభిరాం.

"ఎలా?' అడిగాడు మహదేవ్.

"మం ..... అన్నది మంచికి సూచన. త్ర ..... అనేది సర్వలోకాన్ని సూచిస్తుంది. మన దేశం ఎన్నో కళలకీ, సంస్కృతులకీ, శాస్త్రాలకీ పుట్టిల్లు. మనదేశంలో 'బాబా' అనగానే సాధువు, జౌలియా, సంత్ ఫకీరు, బ్రహ్మచారి అనే ప్రత్యామ్నాయ పదాలు స్ఫురిస్తాయి. వీరు మంత్ర, తంత్ర శక్తులలో అఖండులు.

వీరిలో రకరకాలైనవారు వుంటారు. కొందరు ధార్మికులైతే, మరికొందరు

ఆధ్యాత్మికులు. ఇంకొందరు హఠయోగులు.

వీరిలోనే మాంత్రికులూ, తాంత్రికులూ వుంటారు. ఇదే విధంగా 'పంథ్' సంప్రదాయాలున్నాయి. కొంతమంది అవతార పురుషులూ వున్నారు ..... "

"వారిలో కొందరి పేర్లు చెప్పగలవా?" అభిరాం మాటలకి అడ్డు వస్తూ అన్నాడు మహదేవ్.

పురాణ కాలం నుంచీ తీసుకుంటే హిరణ్యకశిపుడు. అతడు ఎముకలు మాత్రమే విరిగేలా శరీరాన్ని కృశింపజేసుకుని ఘోర తపస్సు చేసి ఎన్నో శక్తులు పొందాడు. రావణుడు తన పది తలలు తరిగి హోమం చేశాడు.

ఇక కలియుగంలో రామకృష్ణ పరమహంస, రమణ మహర్షి వంటి వారెంతో కఠోరమైన దీక్షతో ఎన్నో మహత్తులు సంపాదించారు.

'ఓం' అనే మంత్రశబ్దాన్ని బొడ్డునుంచి పరిపూర్ణంగా ఉచ్ఛరిస్తే కంఠనాళములు, హృదయము, ఉదరము, మెదడు మొదలయినవి ఉత్తేజితమవుతాయి.

'హ్రాం' అనే మంత్రం వలన వాయునాళము, గుండె, పొట్ట, మెదడు శక్తిని పుంజుకుంటాయి. ఇది హృదయంనుండి వెలువడుతుంది. దాంతో పరిశుద్ధమైన రక్తం శరీరమంతటికీ వ్యాపిస్తుంది.

'హ్రీం' అనే మంత్రం కంఠం నుండి వెలువడి ముక్కు, రొమ్ము, గుండె, జీర్ణకోశాలకు పుష్టినిస్తుంది.

'హ్రూం' అనేది నాభి నుండి వెలువడి లివరుకి, ఉదరానికీ, పొత్తి కడుపుకీ శక్తిని ప్రసాదిస్తుంది. 'హ్రైం' అనే మంత్రోచ్చారణ మూత్రపిండాలకి పుష్టిని చేకూరుస్తుంది. 'హ్రః' అనేది మనిషి శరీరంలో అన్ని భాగాలనీ వివిధ వ్యాధులనుంచి రక్షించి, గుండె దడ, నీరసం మొదలైన వాటిని నివారిస్తుంది. ఇవి శాస్త్రీయంగా కూడా నిరూపించబడ్డాయి.

మనల్ని మనం ఆరోగ్యంగా వుంచుకోవటానికి మంత్రాలివి. ఇతరులకి హానిచేసే మంత్రాలు క్షుద్రమైనవి. ఈ మంత్రాలద్వారా కేవలం మనిషి పేరుని ఉచ్ఛరిస్తూ ఎన్నో మైళ్ళ దూరంలో వున్నవారిని కూడా చంపవచ్చు.

మంత్రశక్తుల వలన సంభవించే మరణాలు అతి భయంకరంగా వుంటాయి. దీర్ఘ కాలంపాటు మనిషి కృశించి, క్షీణించి చివరికి మృతి చెందుతాడు.

1964 లో ఉత్తరప్రదేశ్‌లోని మీర్జాపూర్‌లో "పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ" పై ఇటువంటి మంత్ర ప్రయోగం జరిగింది. మీర్జాపూర్‌లో వున్న ఒక గుడిలో ఈ ప్రయోగం నలభై తొమ్మిది రోజులపాటు జరిగింది.

ఆ తరువాత తొంభై రోజులకి పండిట్‌జీ అస్తమించారు ..... "

"బుల్‌షిట్" తల అడ్డంగా వూపుతూ అన్నాడు మహదేవ్.

"ఇదేమీ కాకమ్మ కథ కాదు. ఆ విషయాన్ని మన దేశంలోని చాలా పత్రికలు

ప్రచురించాయి. అప్పటి రాజకీయ వ్యాసకర్త- "టాయ్ సాసీ" ఆ ప్రయోగాన్ని తాను స్వయంగా చూసినట్టు "లండన్ టైమ్స్"లో రాశాడు ..... "

"1964లో జరిగిన సంగతి నీకెలా తెలుసు? అప్పటికి నువ్వుగాని, నేనుగానీ పుట్టలేదుగా?"

చిన్నగా నవ్వుతూ వెటకారంగా అన్నాడు మహదేవ్.

"నిజమే! కానీ కొన్ని పత్రికల్లో ఆ వార్త నేను చూసి దాదాపు రెండు మూడేళ్ళు అవుతుంది. ఇలా మంత్ర తంత్రాలు వున్నాయా లేవా అన్న విషయమై చర్చిస్తూ పండిట్‌జీ వార్త కూడా రాసారందులో ..... " అన్నాడు అభిరాం.

అతని మాటల్ని మహదేవ్ తేలిగ్గా కొట్టిపడేస్తున్నట్టు నిట్టూర్చాడు.

అది గమనించిన అభిరాంకి ఉక్రోషం వచ్చింది.

"ఆటో రైటింగ్ గురించి విన్నావా నువ్వు" అనడిగాడు అభిరాం.

"విన్నాను ..... " అన్నాడు మహదేవ్.

"అంటే ఏమిటి?" అంటూ అడిగాడు అభిరాం.

"ఆటోలమీద రాసే స్లోగన్స్" చిలిపిగా నవ్వుతూ మహదేవ్.

"జోక్‌లొద్దు" విసుగ్గా అన్నాడు అభిరాం.

"సరె! సరె! ఏమిటో చెప్పు" కూలయిపోతూ అన్నాడు మహదేవ్.

"ఆటోరైటింగ్ అంటే ప్రేతాత్మలని ఆవాహన చేసుకొని వాటి ద్వారా జరగబోయేవి తెలుసుకునే పద్ధతి. ఈమధ్యే ఓ ఆంగ్ల పత్రికలో మరణించిన భర్త ఆత్మ యొక్క ఆటో రైటింగ్ సహాయంతో నలుగురికీ వుపయోగపడుతూ, ధనవంతురాలైన ఓ మహిళ గాథ చదివాను."

"ఆహా ..... !" అన్నాడు మహదేవ్.

"అమెరికాకి చెందిన లూసీ బర్టన్ అనే మహిళ భర్త మరణించాడు. అతని పేరు విల్లీ బర్టన్. వారిది ఎంతో అన్యోన్య దాంపత్యం. వారికి పిల్లల్లేరు. ఆ భార్యాభర్తలే ఒకరికొకరు ఆలంబనగా జీవించేవారు.

విల్లీ బర్టన్ ప్రమాదవశాత్తు మరణించాడు. లూసీ ఒంటరితనంతో, భర్త జ్ఞాపకాలతో పిచ్చెక్కిపోయింది. అప్పుడే ఆమెకి తెలిసింది-- ఆటో రైటింగ్ ద్వారా చనిపోయినవారితో మనసులోని భావాలని పంచుకోవచ్చని. దాంతో రోజూ కాగితం మీద కలం వుంచి రాత్రంతా వేచి చూస్తూండేది.

రోజులు గడిచేవి కాని ఏ ఫలిమూ వుండేదికాదు. అయినా ఆమె నిరాశచెందకుండా ప్రతిరోజు క్రమం తప్పకుండా అలా వేచి చూస్తూనే వుంది.

సరిగ్గా ఆమె భర్త మరణించి సంవత్సరకాలం పూర్తయిన రోజే ఆమె సుదీర్ఘ నిరీక్షణ ఫలించింది. ఆ రాత్రి కాగితం మీద కలం కదిలింది.

అమె ఇంతింత నేత్రాలు చేసుకు చూస్తుండగా "నేను నీ భర్తను వచ్చాను" అని కదిలి

కాగితం అడుగుభాగంలో విల్లీ బర్టన్ అనే సంతకం చేసి అచేతనమైంది. ఆ సంతకం అచ్చుగుద్దినట్టు తన భర్త సంతకానికి సరిపోయింది.

ఆమె ఎగిరి గంతేసినంత పని చేసింది. ఆనాటినుంచీ ఆమెకూ, ఆమె భర్తకూ ఈ ఆటో రైటింగ్ ద్వారా సంబంధం కుదిరింది. అతడనేక విశేషాలామెతో చెబుతూ వుండేవాడు. అతనిది సూక్ష్మ శరీరం కనుక ఎంత దూరాన జరుగుతున్న సంగతులనైనా క్షణంలో చూచివచ్చి చెబుతుండే వాడు.

అతని సహాయంతో ఆమె అనేక విషయాలు చెప్పగలుగుతూ, మానవాతీతమైన అంశాలలో సలహాలిస్తూ బాగా పేరు, డబ్బు సంపాదించుకుంది. ఆమెవల్ల ఎందరికో ఎన్నో కార్యాలు నెరవేరాయి.

అందులో ముఖ్యమైనది ఒక కోటీశ్వరుడి ఉదంతం- "క్రిచ్ టన్ బర్కిలీ"అనే అతనికి అమెరికాలో ఒక విశాలమైన స్థలం వుంది.

దానిలో ఒక పెద్ద బిల్డింగ్ కట్టిద్దామని ప్లాను గీయించి నిర్మాణం మొదలుపెట్టాడు. అప్పట్నుంచీ అతనికి ఎన్నో సమస్యలొచ్చిపడసాగాయి. పని ప్రారంభించిన ప్రతిసారీ అతనికో, ఇంట్లోవాళ్ళకో, కూలీలకో అనారోగ్యం వచ్చి నిర్మాణం ఆగిపోయేది.

దాంతో వాళ్ళకి అనుమానం వచ్చి అతీత శక్తులలో సంబంధం కలిగిన వ్యక్తిగా ప్రసిద్ధిపొందిన లూసీ బర్టన్‌ని కలుసుకొని సమస్య వివరించారు.

ఆమె రాత్రికి ఆ విషయం తన భర్తనడిగింది. అశరీరుడైన ఆమె భర్త ఆత్మ ఆ క్రిచ్‌టన్ స్థలం దగ్గరకు వెళ్ళింది. అక్కడ అతనివంటి ప్రేతాత్మలే కొన్ని కనిపించాయి. వాటితో మాట్లాడాడతను.

ఆ స్థలం లోపల తమ సమాధులు వున్నాయని, అవి పూడిపోయి పైకి మామూలు నేలలానే కన్పించటంతో ఆ సంగతి ఎవరికీ తెలీలేదని, ఆ స్థల యజమాని జరప తలపెట్టిని నిర్మాణం వల్ల తమకీ, తమ సమాధులకీ యిబ్బంది కలుగుతుందని వివరించాయి. తమ సమాధులు కదిలించటంగానీ, తామక్కడినుంచి తరలిపోవడం గానీ వాటికిష్టం లేదన్నాయి.

అందుకే భవన నిర్మాణం మొదలుపెట్టగానే ఆ ప్రేతాత్మలు ఏవో ఒక అడ్డంకులు సృష్టించేవి. దాంతో పనాగిపోయేది.

ఆ స్థల యజమానికీ, అతని కుటుంబసభ్యులకూ, పనివాళ్ళకూ రోగాలూ, బాధలూ రాకుండా వుండాలంటే అక్కడ త్రవ్వటం, భవన నిర్మాణానికి పూనుకోవటం మానాలని ఆ ప్రేతాత్మలు విల్లీ ఆత్మతో చెప్పాయి. అతడు భార్యకి ఆటో రైటింగ్ ద్వారా ఈ విషయం మొత్తం తెలియపరిచాడు.